
# అనుపమ పెళ్లి

కె. మీరాబాయి



"చీకటి పడకముందే ఇంటికి చేరకూడదటే అనలే కాలం బాగులేదు" లోపలకు వస్తున్న కూతుర్ని చూసి, తరుగుతున్న కూరగాయలు పక్కన పెట్టి, లేచి కాఫీ కలపబోతూ అంది రాజేశ్వరమ్మ.

ముఖం చిట్లించింది అనుపమ. "వచ్చి ఏం చేయాలి? నీకు వంటలో సాయం చెయ్యాలి. తర్వాత నువ్వు నాన్న ముందు కూర్చుని కబుర్లు చెబుతుంటే నేనొకర్తినే లోపలి గదిలో కూర్చుని జపం చేసుకోవాలి. అంతేగా?" విసుగ్గా అని కాఫీ గ్లాసు అందుకుని వెళ్ళిపోయింది.

రాజేశ్వరమ్మ నిట్టూర్చింది.

"ఈ పిల్ల ఎందుకో ఇలా తయారయిందీ మధ్య. మాటకు మాట ఎదురు జవాబు. ఎందుకులే గొడవ అని ఊరుకుంటే 'నాతో మాట్లాడ్డమే నీకు కష్టంగా వుంది' అంటుంది. తొందరగా ఏదో ఒక సంబంధం కుదిర్చి ఆ మూడు ముళ్ళూ వేయించేస్తే తమ బాధ్యత తీరిపోతుంది." అనుకుంది.

వంట పూర్తి కావొస్తుండగా షికారుకెళ్ళిన జనార్ధనరావు తిరిగి వచ్చారు.

కంచాలు పెట్టి తండ్రీ కూతుళ్ళను భోజనానికి పిలిచింది రాజేశ్వరమ్మ.

ఎవరో క్రొత్తవాళ్ళు ఇంట్లో వున్నట్లుగా మాటా పలుకూ లేకుండా అన్నం తింటున్న కూతుర్ని తనే పలుకరించాడు జనార్థనరావు.

"ఏమ్మా ... ఆ బ్యాంకు పరీక్షకు ఏమన్నా చదువు తున్నావా? ఆషామాషీగా తీసుకుంటే లాభం లేదు."

"మొన్నటి దాకా పరీక్షలనిరాత్రింబవళ్ళు చదువో చదువో అన్నారు. ఇప్పుడేమో ఉద్యోగం కోసం చదువు కోమంటూ గొడవ. చదువుతూనే వున్నాగా నాన్నా? మనింట్లో వి. సి. ఆర్. వి. సి. పి. గానీ వుందా ఏం? రోజూ హాయిగా సినిమాలు చూస్తున్నానని మీరు బాధ పడటానికి?" విసుగును అణచుకుంటూ అన్నది అనుపమ.

దెబ్బతిన్నట్లు భార్యకేసి చూసారు జనార్థనరావు.

"అవేం మాటలే? నాన్న చెబుతున్నది నీ మంచి కోసమేగా..." మందలింపుగా అంది రాజేశ్వరమ్మ.

తల్లి అన్నం వడ్డించబోతుంటే చెయ్యి అడ్డం పెట్టి "చాలు. కడుపు నిండిపోయింది" అంటూ లేచి వెళ్ళిపోయింది అనుపమ.

* * *

"అమ్మా! సుందరికి పెళ్ళి కుదిరింది తెల్సా?" ఉత్సాహంగా అంది అనుపమ.

"అదేమిటే ... చదువు పూర్తి కాకుండానే పెళ్ళికేం తొందరొచ్చిందంట? ఇంకా చిన్న పిల్ల అప్పుడే...." ఇంకా రాజేశ్వరమ్మ మాటలు పూర్తి కాకముందే.

"చిన్నపిల్లేమిటి? పంతొమ్మిదేళ్ళు నిండుతుంటే? చదువు పూర్తికాకపోతే మునిగిపోయే దేముంది? అబ్బాయి ఇంజనీరు తెలుసా? బాగా ఉన్నవాళ్ళట. ఇక డిగ్రీ పూర్తిచేసి ఇదేం ఉద్యోగం చెయ్యాలా ఏం? హాయిగా స్కూటరు మీద సినిమాలు, షికార్లూ తిరగడమేగా.." అంది అనుపమ.

రాజేశ్వరమ్మ కూతురివైపు పరీక్షగా చూసింది 'ఇదేం ఆలోచనలు?' అన్నట్లు.

"ఆ పిల్లకు చదవాలని లేదా?"

"అదొక పిచ్చి మొద్దు. 'ఫైనలియరు కదా.. పరీక్షలు రాసాక ముహూర్తాలు పెట్టుకోండి' అంటూ గొణుగు తూంది. అబ్బాయి తరపువారేమో డిసెంబరులో పెళ్ళి చేసెయ్యాలి అన్నార్ట. నోరు మూసుకుని పెళ్ళికి ఒప్పుకో అని నేనూ కూడా నచ్చజెప్పాను." అనుపమ అంది.

"సరేలే.. నువ్వెళ్ళి పుస్తకం పట్టుకో. మీ నాన్నగారొస్తే కోప్పడతారు. ఆ పరీక్షేదో కష్టపడి చదివి రాయరాదుటే. బంగారం లాటి బ్యాంకు ఉద్యోగం!" అంది రాజేశ్వరమ్మ.

"నీకూ, నాన్నకూ నా చదువు తప్ప మరొకటి అక్కర్లేదు. నాకీ జైలు శిక్ష ఎప్పుడు తప్పుతుందో.." గొణుక్కుంటూ టపటపా అడుగులు వేస్తూ గదిలోకి వెళ్ళింది అనుపమ.

'ఈ పిల్లకు పెళ్ళి మీద దృష్టి పడినట్టుంది. త్వరగా పెళ్ళి కుదర్చమని ఈయనగారితో చెప్పాలి' అనుకుంటూ వంటింట్లోకి నడిచిందావిడ.

* * *

"చూడు రాజీ. దానికి తెలిసో, తెలియకో పెళ్ళంటే ఉబలాటపడిందనుకో. నువ్వూ తొందరపడితే ఎలా? లోకం పోకడ చూస్తున్నావుగా. డబ్బు మీదే నడుస్తోంది. ఇదివరకటి ఆడపిల్లకు పెళ్ళి చేసేస్తే చాలు జీవితానికి రక్షణ, తోడు ఇచ్చినట్లే అని ధైర్యంగా వుండ గలిగేవాళ్ళు ఆడపిల్లను కన్నవాళ్ళు. ఆ మొగుడు కొట్టినా తిట్టినా అణగి మణిగి ఉండేవాళ్ళు ఆడవాళ్ళు. ఆ మగవాళ్ళు కూడా చీట్లాటాడినా, సాని కొంపలు తిరిగినా పెళ్ళాలని వదిలేయడం అనేది జరిగేది కాదు. కానీ ఈ కాలం ఆడపిల్లలకు పౌరుషం జాస్తి. మాటపడరు. మగవాళ్ళంటావా? మాసిపోయిన చొక్కా మార్చినట్లు భార్యని మార్చగల వాళ్ళున్నారు. కట్నం మీది ఆశతో ఆడపిల్లని కాల్చి చంపగల కర్కోటకులున్న కాలమిది. తన సంపాదనంటూ లేకపోతే ఆడపిల్లల బ్రతుకు ఏ రోజు వీధిన పడుతుందోనని భయపడే రోజులివి. అందుకే అమ్మాయికో ఉద్యోగం అంటూ దొరికాక పెళ్ళి చేద్దామని చూస్తున్నా..." ఓపికగా

వివరించిన భర్త మాటల్లోని యదార్థం కాదనలేక ఆలోచనలో పడింది రాజేశ్వరమ్మ.

* * *

"అమ్మా! సుందరిని ఇప్పుడే కాలేజీ మానిపించేయమన్నార్ట. పెళ్ళవగానే జనవరిలోనే కాపురానికి తీసుకెడతాం కదా ఇక ఈ నెల్లాళ్ళు మాత్రం ఆ చదువు దేనికి? అన్నార్ట" హడావుడిగా వస్తూ చెప్పింది అనుపమ.

"అయితే డిగ్రీ పూర్తి చేయాలన్న ఆ పిల్ల సరదా తీరదన్న మాటేగా. ఇంతకీ వాళ్ళమ్మా వాళ్ళు ఏమంటున్నారు?" జాలిగా అంది రాజేశ్వరమ్మ.

అనుపమ తల్లివేపు ఆశ్చర్యంగా చూసింది: "కూతురికి తొందరగా పెళ్ళి అయితే చాలునను కుంటుంది ఏ తల్లి అయినా... లక్షణంగా పెళ్ళి చేసుకుని పిల్ల సుఖపడుతుందంటే వాళ్ళు మాత్రం ఏమంటారు?"

కూతురు గొంతులో ఏ మూలో కొద్దిగా వ్యంగ్యం తొంగి చూసినట్టనిపించింది రాజేశ్వరమ్మకు. కానీ, దాని గురించి వాదనలోకి దిగడం ఇష్టం లేక మాట మార్చింది.

"అన్నట్లు చెప్పడం మర్చిపోయాను. అక్కయ్య నుండి ఉత్తరం వచ్చింది. ఎల్లుండి వస్తున్నానని రాసింది."

"ఏమిటీ? ఒక్కత్తే వస్తూందా? ఆశ్చర్యంగా వుందే. దాన్ని వదిలి రెండ్రోజులైనా వుంటారా బావగారు? అయితే ఈసారి అక్కతో కల్సి బోలెడు సినిమాలు చూస్తాను" సంబరంగా అంది అనుపమ.

"ఏం చూస్తారో చూద్దాం. ఆరోగ్యం బాగుండలేదని రాసింది. ఏం కారణమో మరి...." అంటూ లోపలికి వెళ్ళింది రాజేశ్వరమ్మ.

అనుపమ గదిలోకి వెళ్ళి అక్క గురించి ఆలోచిస్తూ కూర్చుంది.

అనుపమ కన్న చక్కనిది నిరుపమ. నిరుపమ డిగ్రీ రెండో సంవత్సరం చదువుతుండగానే వాళ్ళ కాలేజీ ఎదురుగా వున్న వెటర్నరీ హాస్పిటల్‌లో డాక్టరుగా పని చేస్తున్న శ్రీహరి ఆ పిల్లను ఇష్టపడి పెద్దవాళ్ళను ఒప్పించి పెళ్ళి చేసుకున్నాడు.

పెళ్ళైన ఏడాదిలోపుగానే అక్కడి నుండి ట్రాన్స్‌ఫరయి వెళ్ళిపోయారు వాళ్ళు.

ఇరవైఏళ్ళు నిండకముందే బిడ్డ తల్లి అయింది నిరుపమ.

చెల్లిలా తను డిగ్రీ పూర్తి చేయలేకపోయానని బాధపడుతుంది.

'అక్క అదృష్టవంతురాలు. ప్రేమించి, పెళ్ళాడిన భర్త. వేరు కాపురం. ఇంకేం కావాలి?' అనుకుంటూ నిట్టూర్చింది అనుపమ.

* * *

అనుకున్నట్లుగానే రెండో రోజున వచ్చింది నిరుపమ.

కూతుర్ని చూడగానే అనారోగ్యానికి కారణమేమిటో ఇట్టే గ్రహించింది తల్లి.

"ఎన్నో నెలమ్మా?" అంది మనమరాల్ని అందు కుంటూ...

"మూడు" సిగ్గుపడింది నిరుపమ.

భోజనాలైనాక అక్కయ్య పెట్టె తెరిచింది అనుపమ. "ఏవీ .ఎన్ని చీరెలు కొన్నావే· చూపించు. ఏమేం సినిమాలు చూసావ్?"

నిరుపమ నిరుత్సాహంగా నవ్వింది.

"ఇదిగో నీకు ఈ చీరె తీసుకువచ్చాను. నచ్చిందా?" అంటూ నూటయాభైలోపు ఖరీదున్న చీరె అందించింది చెల్లెలికి.

అనుపమ ఉత్సాహం కాస్తా నీరు కారిపోయింది. అక్క మనసు నొప్పించలేక ఆ చీరె తీసుకుని 'బాగుంది' అంది.

"నువ్వేం కొనుకున్నావ్?" పెట్లోకి తొంగి చూసింది.

"ఏం కొంటానే నా మొహం? వెయ్యి రూపాయలు ఇంటి అద్దెకు పోస్తున్నాం. ఇక పాపాయి పాల డబ్బాలూ, నా డాక్టరు ఖర్చులూ, మీ బావ జీతం బొటాబొటిగా సరిపోతోంది మాకు. ప్చ్...నేనూ నీలాగ డిగ్రీ పూర్తి చేసినా బాగుండేది. ఏదో ఒక ఉద్యోగానికి ప్రయత్నించేదాన్ని మీ బావ పైకి తేలరు గానీ తనకూ మనసులో అదే అసంతృప్తి వుందనుకుంటా..." బరువుగా అంది నిరుపమ.

అనుపమకు నీరసంగా అనిపించింది. 'ప్రేమించి పెళ్ళాడినవాడితో ఎంతో సుఖపడి పోతోందనుకున్న అక్క సంసారం ఇంతేనా' అనిపించి.

* * *

నిరుపమ వుండగానే సుందరి పెళ్ళి జరిగింది. ఆ పిల్లను చిన్నప్పటి నుండీ తెలుసు గనుక అందరూ పెళ్ళికి వచ్చారు. పెళ్ళిలో బాగా అలంకరించుకుని సంబరంగా తిరిగిన అనుపమ ఇంటికి వచ్చేక స్తబ్దంగా వుండిపోయింది.

"ఏమిటే.. నీకూ పెళ్ళి మీద గాలి మళ్ళిందా? త్వొందరలో ఆ ముచ్చటా తీరుతుందిలే.." నిరుపమ హాస్యంగా అంది.

"అని నువ్వంటే సరిపోయిందా? అమ్మా నాన్నలకేమో నేను ఉద్యోగం చేసి సంపాదించాలని వుంది" అంది అనుపమ.

నిరుపమ తల్లితో ఈ విషయం ప్రస్తావించింది. "అది సంపాదించి మాకు పెట్టాలని మేము ఎదురు చూడ్డం లేదమ్మా. దాని పెళ్ళి కోసం అది డబ్బు కూడబెట్టాలనీ మాకు ఆశ లేదు. ఉద్యోగం వుంటే రేపొద్దున్న దానికే సుఖమని అనుకున్నా." అంటూ నొచ్చుకుంది రాజేశ్వరమ్మ.

నిరుపమ వెళ్ళిపోయాక అనుపమ మరికాస్త దూకుడుగా తయారయ్యింది.

ఏం మాట్లాడినా సూటిపోటీగా తలి తండ్రులు తనకోసం ఏమీ చేయడం లేదన్నట్లు మాట్లాడ్డం మొదలుపెట్టింది.

"మొన్ననే కదే సినిమాకు వెళ్ళొచ్చావు. మళ్ళీ ఈరోజు కూడానా?" అని తల్లి అనడం చాలు.

"నా ముఖానికి ఆ మాత్రం సరదా కూడా వుండడం మీకిష్టం లేదులా వుంది" అనేసింది.

రాజేశ్వరమ్మ భర్త దగ్గర కళ్ళనీళ్ళ పర్యంత మయ్యింది.

"దానితో పడటం నావల్లకాదు. ఏదో ఒక సంబంధం చూసి ముడిపెట్టి పంపేయండి" అంది నిష్ఠూరంగా.

తండ్రి పోరు పడలేక అయిష్టంగానే పరీక్ష రాసింది అనుపమ.

అనుకున్నట్లుగానే సెలక్షను రాలేదా అమ్మాయికి. 'ఇకమీదట ఉద్యోగం మాట ఎత్తరులే' అనుకుని తృప్తిపడింది గానీ కించిత్తు కూడా బాధపడలేదు అనుపమ.

సుందరి పుట్టింటికి వచ్చిందని తెలిసి ఆమె క్రొత్త కాపురం ముచ్చట్లు వినాలన్న సరదాతో ఆరోజే వాళ్ళింటికి బయల్దేరింది.

అప్పుడే పూచిన బొండుమల్లి పువ్వులా ముద్దుగా బొద్దుగా అందంగా ఉండే సుందరి ఛాయ తగ్గి, నీరసంగా, వడలిపోయి కనబడింది.

"ఓహెరా చాలా క్విక్ ప్రోగ్రెసే" అంటూ మేలమాడింది అనుపమ స్నేహితురాలి పొట్ట మీద చేయి వేసి.

"ఏమి లేకపోయినా దీనికేమి తక్కువ?" అనుపమ చేతిని త్రోసివేస్తూ దిగులుగా అంది సుందరి.

"నీకిప్పుడేం తక్కువయిందేం?" విచిత్రంగా అంది అనుపమ.

"మీ ఆయనకు పెద్ద ఉద్యోగం. వుండేది సిటీలో. చేతిలో స్కూటరుంది. ఇంకా ఏం కావాలి సుఖంగా వుండటానికి?" అంది మళ్ళీ తనే.

"ఎన్ని ఉన్నా ఆడపిల్ల తమింటికి వస్తూ ఏం తెచ్చిందని చూసే మనస్తత్వం మాత్రం మారదే మనవాళ్ళకు. బోలెడు కట్నమిస్తామని ఎన్నో సంబంధాలు వచ్చేయిట. లక్షణంగా, ఉద్యోగం చేసి సంపాదించే పిల్లనిస్తామంటూ వచ్చేర్ట. 'అవేమీ కాదని నన్ను చేసుకున్నాడు ఈ చవట.. అంటుంది మా అత్తగారు." సుందరి గొంతు బొంగురుపోయింది.

"మీ ఆయనేం మాట్లాడ్డా?"

"ఎందుకు మాట్లాడరూ? అప్పుడప్పుడు తనూ అంటారు. 'కనీసం డిగ్రీ చదివిన పిల్లను చేసుకుంటే బాగుండేది ఏదో ఉద్యోగం చేసేది'...అంటూ" సుందరి పేలవంగా నవ్వింది.

అనుపమకు అయోమయంగా అనిపించింది. ఇంటికి వచ్చిందేగానీ తల్లి సుందరి-గురించి అడిగితే మాట్లాడకుండా వుండిపోయింది. ఆ పిల్ల దిగులుగా వుండటం చూసి మరి రెట్టించలేదు రాజేశ్వరమ్మ.

మర్నాడు సుందరి వాళ్ళమ్మే వీళ్ళింటికి వచ్చింది.

"చీటికీ మాటికీ కట్నం తక్కువనీ, ఉద్యోగమైనా చేసే యోగ్యత లేదనీ సాధిస్తారట పిన్నీ. కోపమొచ్చి నప్పుడల్లా "ఫో మీ పుట్టింటికి' నేను సాకలేను నిన్నుఅంటాడుట" అనిచెప్పి కంటనీరు పెట్టిందావిడ.

రాజేశ్వరమ్మ తనకు తోచినట్లు ఓదార్చింది "ఈసారి పిల్లను ఆర్నెల్లు మీ దగ్గరే పెట్టుకుని ఆ డిగ్రీ ఏదో వచ్చేట్లు చూడండి. తర్వాత నెమ్మదిగా బి.ఇ.డి. గనుక చేస్తే ఏదో ఒక స్కూల్లో టీచరుగా చేరి అయిదారు వందలైనా తనదంటూ సంపాదన ఏర్పాటు చేసుకుంటుంది. అప్పుడు 'పుట్టింటికి ఫో' అంటూ తరిమేయడానికి వాళ్ళే జంకుతారు" అంది.

గదిలో కూర్చుని ఈ సంభాషణ వింటూనే వుంది అనుపమ.

ఆరోజు సాయంత్రం ఇంటికి వస్తూనే భార్యతో చెప్పారు జనార్ధనరావు గారు. "రేపు అమ్మాయిని చూడడానికి పెళ్ళివారు వస్తున్నారు. కాస్త తొందరగా లేచి తెమలమని చెప్పు నీ కూతురికి" అని.

ఏ మాత్రం ఉత్సాహం చూపకుండా తల్లి చెప్పినట్టల్లా చేసింది అనుపమ.

పెళ్ళి కొడుకు నల్లగా ఎత్తుగా ఉన్నాడు. పి.డబ్ల్యుడి.లో సూపర్‌వైజర్‌గా చేస్తున్నాట్ట. కట్నం పాతిక వేలిస్తే ఏ మాటా ఆలోచించి చెప్తామని వెళ్ళారు.

రాత్రి తల్లి నిద్రపోయాక తండ్రి దగ్గరకు వచ్చి కూర్చుంది అనుపమ.

చదువుతున్న పుస్తకం మూసి "ఏమిటమ్మా?" అన్నారు జనార్ధనరావు గారు.

"నాన్నా... నేను ఉద్యోగం వచ్చేక పెళ్ళి చేసు కుంటాను. ఈసారి కష్టపడి చదివి పరీక్ష రాస్తాను. ఒక ఏడాది దాకా నా పెళ్ళి గురించి ఆలోచించకండి ప్లీజ్..." అంది అనుపమ తలవంచుకుని.

ఏదో అడగబోయి, ఆగిపోయి, కూతురి తల నిమురుతూ వుండిపోయాడాయన.